క్లుప్తంగా

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో ఆశా కార్యకర్త పోస్టు ఖాళీగా ఉండటంతో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మీనరసింహ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానికులై ఉండి నాయకత్వ లక్షణాలు కలిగిన పదో తరగతి ఉత్తీర్ణత అయిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 6వ తేదీలోపు పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యశాలలో అందజేయాలని కోరారు.

డీఎంహెచ్ఓకు కృతజ్ఞతలు

కురిచేడు: ఏఎన్ఎం గ్రేడ్–2 సాధారణ బదిలీలు పారదర్శకంగా నిర్వహించినందుకు ఏపీజీఈఏ ఉద్యోగుల సంఘం డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా బదిలీలు జరపడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు చాకచక్యంగా వ్యవహరించారని సంఘ నాయకులు ఎన్వీ సుబ్బారెడ్డి కొనియాడారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా బదిలీలు జరగటంపై ఏఎన్ఎంలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛమైన నీరు తాగితేనే ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

పెద్దారవీడు: విద్యార్థులు స్వచ్ఛమైన నీటిని తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ జగదీష్ అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ ఫ్లోరైడ్ ఉన్న నీటిని ఎక్కువగా తాగితే దంతాలకు గార పట్టడం, మోకాళ్ల నొప్పులు రావడం, కాలు చేతులు వంకర పోవడం వంటి లక్షణాలు కనడతాయని చెప్పారు. జిల్లా ఫ్లోరోసిస్ అధికారి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్‌లపై కఠిన చర్యలు


స్కూల్ బస్‌ను తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

బేస్తవారిపేట: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్‌లపై కఠిన చర్యలు తప్పవని మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు హెచ్చరించారు. మంగళవారం బేస్తవారిపేటలో ప్రైవేట్ స్కూల్ బస్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బస్సులో ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికెట్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా ఉండాలని డ్రైవర్లకు సూచనలిచ్చారు. ట్యాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని ఓ స్కూల్ బస్‌కు రూ.1,69,040 జరిమానా విధించారు. వాహనాన్ని సీజ్ చేసి బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురం గ్రామానికి చెందిన సూరం శంకర్‌రెడ్డి(57) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. పూసలపాడు మోడల్ ప్రైమరీ స్కూల్లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన అర్ధరాత్రి వేళ గుండెపోటుకు గురవడంతో గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శంకర్‌రెడ్డి భౌతికకాయానికి ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన 11 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రండి బాబూ..రండి!

- తక్కువ ధరకే మద్యం విక్రయం
- కూటమి ప్రభుత్వం ఇంటింటికీ మద్యం

దొనకొండ:

ఇంటింటికీ కూరగాయలు అమ్మేవాళ్లు వచ్చినట్లు మద్యం అమ్మేవాడు ఇంటింటికీ వచ్చి రండి బాబూ..రండి మీ ఇంటికే మద్యం వచ్చింది.. కూటమి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. తీసుకోండి బాబూ..తాగండి బాబూ అంటూ ఓ వ్యక్తి ఏకంగా ద్విచక్ర వాహనంపై మద్యం అమ్ముతున్నాడు. మద్యం మహమ్మారి పల్లెల్లో విలయతాండవం చేస్తోంది. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. వైఎస్సార్ సీపీ పాలనలో మండల కేంద్రానికే పరిమితమైన మద్యం దుకాణాలు నేడు విచ్చలవిడిగా పల్లెపల్లెకు ఒకటి లేదా రెండు అవసరమైతే మూడు దుకాణాలు వెలిశాయి. ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు మద్యం లైసెన్స్‌లు అప్పగించినట్లు చెప్తున్నా 99 శాతం టీడీపీ నాయకులకే దక్కాయన్నది నిజం. మద్యం దుకాణాలు ఎక్కడైనా నిర్వహించుకోవచ్చు. ఊర్లో, ఊరి బయట నిర్వహించుకోవచ్చు. అవసరమైతే చిల్లర దుకాణాల్లో అమ్ముకోవచ్చు అనేది ప్రభుత్వం మద్యం పాలసీలో ఒక భాగం. మద్యం దుకాణాలకు అనుసంధానంగా పల్లెల్లో బెల్టుషాపులు పుట్టుకొచ్చాయి. కూటమి సానుభూతిపరుల మధ్య మన ప్రభుత్వంలో సంపాదించుకోవాలి అనే దురుద్దేశం పుట్టి మండల,


స్కూటీపై మద్యం విక్రయిస్తున్న యువకుడు

గ్రామ నాయకులు మధ్య పోటీ పెరిగి అదనంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.

బైకులపై వచ్చి విక్రయం

దొనకొండ 1, 2, చందవరం గ్రామాల్లో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ దుకాణాల యజమానుల్లో పోటీతత్వం పెరిగి ఇంటింటికీ మద్యం విక్రయిస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. తూతూమంత్రంగా కూటమి ప్రభుత్వం కనుసైగలతో కొంతమందిపై కేసు నమోదు చేసినా మద్యం దందా ఆగటం లేదు. కూటమి నాయకులు అండ చూసుకుని మద్యం వ్యాపారం చేస్తున్నారు. నాయకుల ఒత్తిళ్లతో బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు సైతం దాడులకు వెనకాడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు తూతూ మంత్రంగా మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. మామూళ్ల మత్తులో ఉండటంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కంటికి కనపడని బెల్ట్‌షాపులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ మొదలైంది. బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక క్వార్టర్ సీసాపై రూ.50 నుంచి రూ.60 అదనంగా వసూలు చేస్తున్నారు. అదేమని మందుబాబులు అడిగితే పైఅధికారులు, కింది అధికారులకు, దుకాణంలో అమ్మేవారికి లంచాలు ఇవ్వాలని, అందుకే తాము అధిక ధరలకు అమ్ముతున్నామంటున్నారు. చాలా గ్రామాల్లో తమ గ్రామానికి బెల్ట్‌షాపులు రద్దు చేయాలని వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకునే నాథుడు కూటమి ప్రభుత్వంలో కరువయ్యారని విమర్శలు వస్తున్నాయి. 6 నెలల క్రితం రుద్రసముద్రం గ్రామస్తులు తమ గ్రామంలో బెల్ట్‌షాపులు వద్దని కొంతమంది మహిళలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా ఆ గ్రామంలో బెల్ట్‌షాపుల జోరు తగ్గలేదు.

నిబద్ధత ఉన్న కార్యకర్తను కోల్పోయాం


శరత్‌పాల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి


జెడ్పీటీసీ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బూచేపల్లి

- శరత్‌పాల్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ముండ్లమూరు (దర్శి): నిజాయితీ, నిబద్ధతతో పని చేసే మంచి కార్యకర్తను కోల్పోయామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వరగాని ఇశ్రాయేల్ కుమారుడు శరత్ పాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పసుపుగల్లులో శరత్‌పాల్ విగ్రహావిష్కరణ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. బూచేపల్లికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో శరత్‌పాల్ మృతి చెందడం తనను ఎంతో బాధించిందన్నారు. ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొంచుకునే వ్యక్తి ఇప్పుడు లేకపోవడం జీర్ణించుకోలేని విషయమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వేములబండలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అవుల గౌతంకు ఎమ్మెల్యే బూచేపల్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రత్నరాజు కుటుంబానికి పరామర్శ

ఇటీవల చికిత్స చేయించుకుని వచ్చిన జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు తండ్రిని, అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు డగ్లస్ సోదరుడిని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, మాజీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, నాయకులు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

దొనకొండ: కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు బి.బాలకోటయ్య, కార్యదర్శి లూకయ్య, ఉపాధ్యక్షుడు ఇశ్రాయేలు, సహా ఉపాధ్యక్షురాలు రాణి తదితర కార్మికులతో కలిసి దేశ వ్యాప్తంగా జరగబోయే జూలై 9 సమ్మె నోటీసును పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తికి అందజేశారు. 132, 142, 680 జీఓలపై హైకోర్టు తీర్పు అమలు తదితర డిమాండ్ల పరిష్కారానికై పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని అంజయ్య కోరారు.


వైద్యాధికారికి అర్జీ అందజేస్తున్న ఆశా కార్యకర్తలు


పంచాయతీ కార్యదర్శికి అర్జీ అందజేస్తున్న అంజయ్య

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో దొనకొండ ప్రాథమిక వైద్యశాలలో జూలై 9న జరగబోవు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని అధ్యక్షురాలు పైడిపోగు సలోమికుమారి, ఆశా కార్యకర్తల కార్యదర్శి ఎండ్లూరి నాగేంద్రం, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి కలిసి సమ్మె నోటీసును వైద్యాధికారి చంద్రమౌళికి అందజేశారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు, యజమానులకు కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఒప్పంద జీఓలు విడుదల చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాల్లో పని చేసే ఆశా వర్కర్లు జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొనాలని అంజయ్య పిలుపునిచ్చారు.

ఘనంగా అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం


పెద్దదోర్నాలలో డాక్టర్లను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని సిబ్బంది డాక్టర్లను ఘనంగా సత్కరించారు. డాక్టర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. గైనకాలజీ డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ కాజరయ్య, ఈఎన్‌టీ డాక్టర్ మౌనిక, కంటి డాక్టర్ నాగమహేశ్వరి, ఎముకలు, కీళ్ల నిపుణులు డాక్టర్ లావణ్య, డాక్టర్ వైద్య సంజీవ్ తదితరులను ఘనంగా దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ అలేఖ్య, ఫార్మసిస్ట్ పిచ్చిరెడ్డి, ఆరోగ్యమిత్రలు సంగటి మణికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధృమ వారాహిగా జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు మంగళవారం ధృమ వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ బృందం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం టౌన్: సమస్యల పరిష్కార సాధనలో భాగంగా మార్కాపురంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు నెలకు 21 వేల రూపాయల జీతం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏ క్షణంలోనైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ ఎస్.అరుణ తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా మార్కాపురంలోని సహాయ సాంఘిక సంక్షేమ కార్యాలయానికి పంపాలని సూచించారు. షెడ్యూల్ కులాలు, తెగలు, సామాజిక సేవా దృక్పథం, పౌరహక్కుల చట్టం, హత్యా నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలు అర్హులని స్పష్టం చేశారు. మాన్యువల్ స్కావెంజర్ కమిటీ ఏర్పాటుకు కూడా అర్హులైన సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు అనర్హులని తెలిపారు.

గిద్దలూరులో సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వినియోగదారుల సంఘం కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశిరెడ్డినాయన కుంట వద్ద పిల్లలకు ఉపయోగపడే వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. రాచర్ల గేటు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రజలు ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. పొట్టి శ్రీరాములు సెంటర్ సమీపంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుంతలమయమైన సిమెంట్ రోడ్డును బాగు చేయాలని కోరారు. పట్టణంలో సర్వీస్ ఆటోలను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న పాలకులు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ముండ్లమూరు (దర్శి): అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. మండలంలోని శంకరాపురంలో ఆ పార్టీ సభ్యులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పి అందులోనూ కోత పెట్టి రూ.13 వేలే ఇస్తున్నారని మండిపడ్డారు. కుటుంబంలో ఎంతమంది ఆడబిడ్డలు ఉంటే అంతమందికి నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఎటువంటి చార్జీలు పెంచమని ఇంకా అవసరం అయితే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి విద్యుత్ చార్జీలు, నిత్యావసరాలు, ఆస్తి పన్నులు పెంచి ప్రజల మీద మోయలేని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ఇప్పటి వరకు పొగాకు ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రశ్నించారు. ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి ఏడాదిగా ఒక్క ఉద్యోగం ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలు పీకేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని గతంలో అధికారంలోకి వచ్చినప్పుడు, ఇప్పుడు రెండు సార్లు నిరుద్యోగులను నిలువునా మోసగిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే బిగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో నాబార్డ్ ప్రారంభించిన లిఫ్ట్ ఇరిగేషన్‌లు మొత్తం మూలనపడ్డాయని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని రిపేర్లు చేసి వ్యవసాయ భూములకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. మండల సీనియర్ నాయకులు బోడపాటి హనుమంతురావు, పంటా ఏడుకొండలు, రాజా రమేష్, ఎర్రయ్య, హనుమయ్య, సుబ్బారావు, మీరావలి, జయమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే బస్సులు సీజ్ చేస్తాం


స్కూల్ బస్‌లు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి: ఫిట్‌నెస్ లేని బస్‌లను సీజ్ చేస్తామని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. పట్టణంలోని స్కూల్ బస్‌లను మంగళవారం తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని, ఇతర లోపాలున్న బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పాఠశాలల బస్సులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. డ్రైవర్ తన లైసెన్స్ వెంట పెట్టుకుని ఉండాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇన్సూరెన్స్‌లు, ట్యాక్స్‌లు వంటి అన్నీ సమకూర్చుకుని ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు తోలరాదని చెప్పారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


రిపోర్టులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి మాధవరావు

కురిచేడు: ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఎస్.మధుసూదన్‌రావు కోరారు. మంగళవారం ఆయన కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ల్యాబ్‌ను, వెక్టార్ బోర్న్ డిసీజెస్ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు డెంగీ వ్యాధిపై, దోమలతో కలిగే వ్యాధుల గురించి వివరించారు. డెంగీ మాసోత్సవంలో చేయాల్సిన కార్యక్రమాల గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో డెంగీ వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి వి. రవితేజ కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవరెడ్డి, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ ఇశ్రాయేలు, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బద్రి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దర్శి: దోమ కాటుపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా అధికారి మధుసూదన్‌రావు సూచించారు. మండలంలోని చందలూరు పీహెచ్‌సీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ జాతీయ కీటక జనీత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జూలై డెంగీ దినోత్సవం నెలగా భావించి దాని నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ కలిగించే ఏడీస్ దోమ మంచి నీటిలో పెరుగుతుందని, వ్యాప్తి చెందకుండా వారానికి ఒక్కసారి నీటి పాత్రలను శుభ్రం చేసుకోవాలన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ వసంతకుమార్, యూనిట్ అధికారి బసవరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఇశ్రాయేలు, శ్రీనివాసులు, జ్యోతిబాబు, సుభాషిణి పాల్గొన్నారు.

సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ తిరుమలరావు


కౌలుకార్డు గురించి వివరిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

ముండ్లమూరు (దర్శి): ప్రతి రైతు సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తిరుమలరావు సూచించారు. మండలంలోని ఉమామహేశ్వరపురం, నాయుడుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులందరూ సంబంధిత వీఆర్వోను కలిసి కౌలు కార్డులు పొందాలన్నారు. కౌలు రైతులకు కూడా బ్యాంకుల ద్వారా పంట నష్ట పరిహారం అందుతుందని చెప్పారు. ప్రతి రైతు అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే ప్రతి రైతు పంటల సాగు హక్కు పత్రం తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని పడమరనాయుడుపాలెం, ఆవులమంద గ్రామాల్లో సాగు చేసిన పెసర పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. పురుగు ఉధృతిని గమనించారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 80మి.లీ లేదా థయోమిథక్సికమ్ 40 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లా నోటిఫైడ్ పంటలుగా కంది, వరి, సజ్జ, ఎండు మిర్చి, మినుము, నువ్వులు, పత్తి పంటను ఎంపిక చేశారన్నారు. రైతులు పంటల బీమా కట్టేందుకు చివరి తేదీ జూలై 31, వరి పంటకు చివరి తేదీ ఆగస్టు 15 అని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అనిల్, నవీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.